క్లుప్తంగా

మద్దిలేటి స్వామికి వెండి దీపాలు బహూకరణ



వెండి దీపాలు అందజేస్తున్న కలెక్టర్ దంపతులు

బేతంచెర్ల: మండలపరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో తమిళనాడు రాష్ట్రం, శివగంగ జిల్లా కలెక్టర్ పల్లె మధుసూదన్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి రూ.2 లక్షల విలువచేసే వెండి దీపాలను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడుకు అందజేశారు. స్వామి తమ ఇంటి ఇలవేల్పు కావడంతో తమ వంతుగా వెండి దీపాలు అందించినట్లు కలెక్టర్ దంపతులు తెలిపారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం



కోవెలకుంట్లలో నిర్మించిన గ్రామసచివాలయం

కోవెలకుంట్ల: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో కోవెలకుంట్ల–5 గ్రామ సచివాలయ నూతన భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఐదు గ్రామ సచివాలయాలు ఉండగా ఇప్పటికే నాలుగు సచివాలయాలకు కొత్త భవనాలు నిర్మించారు. ఆయా భవనాల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఐదో గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం మొదట రూ.40 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులు చాలకపోవడంతో మరో రూ.6.50 లక్షలు గ్రామ పంచాయతీ నిధులు వెచ్చించి అన్ని హంగులతో భవనాన్ని నిర్మించారు. త్వరలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నూతన భవనాన్ని ప్రారంభిస్తారని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక తెలిపారు.

తండ్రి, కుమారుడిపై కేసు నమోదు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామానికి చెందిన వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో తండ్రి, కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. గురువారం ఎస్‌ఐ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన వెంకట సుబ్బారెడ్డి, మనోహర్ మధ్య ఇంటి వద్ద రస్తా విషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో జరిగిన ఘర్షణలో వెంకట సుబ్బారెడ్డిపై మనోహర్, ఆయన కుమారుడు రాకేష్ దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తండ్రి, కుమారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు మంత్రి పర్యటన

డోన్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం డోన్ పట్టణంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక మధు ఫంక్షన్ హాల్‌లో జరిగే వడ్డెర కులస్తుల ఆత్మీయ సమావేశంలో మంత్రి పాల్గొంటారన్నారు. అనంతరం మల్లెంపల్లెలో జరిగే వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ సీపీ నేత సీమ సుధాకర్‌రెడ్డి ఇంట్లో నూతన వధూవరులను ఆశీర్వదిస్తారన్నారు. సాయంకాలం తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం అవుతారని వెల్లడించారు.

11న మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కోట్ల స్టేడియం వద్ద ఉన్న మోడల్ స్కూల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాల కోరకు ఈ నెల 11వ తేదీన ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రిన్స్‌పాల్ జాస్మిన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టిక్కెట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చని సూచించారు. 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

అంకితభావంతో పనిచేయండి

డోన్ టౌన్: ప్రధానోపాధ్యాయులు విధుల పట్ల అంకిత భావంతో పని చేయ్యాలని డోన్ డివిజన్ ఉప విద్యాధికారి సుధాకర్ రెడ్డి సూచించారు. ఆయన గురువారం స్థానిక కార్యాలయంలో డివిజన్‌లోని నూతన ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు నాడు – నేడు పనులపై పర్యవేక్షణ చేయాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందించాలని సూచించారు. విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు కచ్చితంగా పాటించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు నిర్ణీత సమయంలో పాఠశాలకు హాజరు కావాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మండల విద్యాధికారి ప్రభాకర్ డివిజన్‌లోని హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి భరోసా

- పీహెచ్‌సీ స్థాయిలో 63 రకాల వైద్యసేవలు
- నాడు–నేడు ద్వారా ఆస్పత్రుల అభివృద్ధి



గర్భిణికి వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మౌనిక



రక్త పరీక్ష కోసం శ్యాంపిల్ సేకరిస్తున్న టెక్నీషియన్

బనగానపల్లెరూరల్: ప్రజారోగ్యానికి భరోసా కలిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (పీహెచ్‌సీ) సైతం అధునిక వైద్య పరికరాలు, యంత్రాలు మంజూరు చేయడంతో పాటు వైద్య సిబ్బందిని నియమించారు. గత ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీల్లో కేవలం 15 రకాల సేవలు అరకొరగా అందేవి. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చర్యల వల్ల పీహెచ్‌సీల్లో 63 రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ భారీగా నిధులు కేటాయించడంతో ఆరోగ్య కేంద్రాల రూపురేఖలు మారిపోయాయి. ఒక్కో పీహెచ్‌సీకి యూరిన్ ఎనలైజర్, పీపీఆర్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, సీబీసీ తదితర యంత్రాలను అందజేయడంతో పలు వైద్య పరీక్షలు చేసే అవకాశం కలిగింది. అత్యాధునిక యంత్రాలతో పాటు ల్యాబ్ టెక్నీషియన్ కూడా నియమించారు.

వైద్య సేవలు ఇలా..

హెచ్‌బీ, ప్లేట్‌లెట్ కౌంట్, బ్లడ్ గ్రూపు, హెచ్‌ఐవీ, హెచ్‌సీఎస్టీ, వీడీఆర్‌ఎల్, గల్ల పరీక్ష, ర్యాండం బ్లడ్ షుగర్, యూరియా క్రియాటిన్, మలేరియా, డెంగీ, ఎస్‌ఓటీ, ఎస్‌జీపీటీ, ఎఎల్పీ, లిపిడ్ ప్రొఫైల్, సోడియం, పోటాషియం, క్లోరైడ్, యూరిన్ మైక్రోస్కోపింగ్, వంటి 63 రకాల పరీక్షలు పీహెచ్‌సీలో చేయనున్నారు. దీంతో పేద ప్రజలు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ వైద్యశాలల్లోనే ఉచితంగా టెస్ట్‌లు చేయించుకొని రోగనిర్ధారణ తరువాత ఉచితంగా వైద్య చికిత్సలతో పాటు ఔషధాలు పొందుతున్నారు.

గతం కంటే పెరిగిన ఓపీ

పలుకూరు పీహెచ్‌సీలో గతంలో వైద్య సేవలు అరకొరగా అందేవి. మందులు అందుబాటులో ఉండని పరిస్థితి. దీంతో కేవలం 20 నుంచి 30 మంది వరకు మాత్రమే ఓపీ ఉండేది. ప్రజలకు ఏ చిన్న జ్వరం, దగ్గు వచ్చినా బనగానపల్లె లేదా నంద్యాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మరిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పై సమస్యలకు చెక్‌పెట్టింది. పీహెచ్‌సీలో అన్ని సౌకర్యాలు కల్పించడంతో రోజూ ఓపీ 90–100 వరకు పెరిగిందని ఆస్పత్రి రికార్డులను బట్టి తెలుస్తోంది. అలాగే వైద్యులు గ్రామాలకు వెళ్లి సేవలందించాలనే ఉద్దేశంతో 104 వాహనాన్ని సైతం ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

నాడు – నేడు ద్వారా రూ.45లక్షలతో అభివృద్ధి

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృషితో పలుకూరు పీహెచ్‌సీని నాడు–నేడు పథకం కింద ఎంపిక చేసి రూ.45 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఆసుపత్రి ఆవరణలో సీసీ రోడ్డు, ఓపీ గదిలో ఏసీ ఏర్పాటు చేయడంతో పాటు వైద్యశాలకు పెయింటింగ్ వేయించారు. విద్యుత్ పనులు, ఆసుపత్రిలో ఫ్లోరింగ్‌పనులతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించి ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఈ పీహెచ్‌సీ 38 గ్రామాలకు ప్రజలకు వైద్య సేవలందిస్తోంది.

అందుబాటులో అత్యాధునిక వైద్య సేవలు



పీహెచ్‌సీకి ప్రభుత్వం అత్యాధునిక వైద్య పరికాలను సరఫరా చేసింది. రోగులకు సంబంధించి 63 రకాల పరీక్షలు నిర్వహించేందుకు మాకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రైవేట్ ల్యాబ్‌లో వేల రూపాయాలు ఖర్చయ్యే పరీక్షలు పీహెచ్‌సీలో ఉచితంగా చేస్తాం. ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తూ రోగులకు సేవ చేయడం సంతోషంగా ఉంది.

– సోమశేఖర్, ల్యాబ్ టెక్నిషియన్, పలుకూరు పీహెచ్‌సీ

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం



ప్రభుత్వం పీహెచ్‌సీల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో ఇకపై గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. అలాగే వైద్య పరీక్షలన్నీ ఇక్కడే అందుబాటులో ఉన్నాయి. రోగ నిర్ధారణను బట్టి చికిత్సతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ లక్ష్మీ, సీనియర్ మెడికల్ ఆఫీసర్, పలుకూరు పీహెచ్‌సీ

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

ప్యాపిలి: దివ్యాంగులు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ వెంకటరమణ అన్నారు. పట్టణ సమీపంలో దివ్యాంగులు చేపడుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల కోరిక మేరకు ప్రత్యేకంగా ఉపాధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి రోజు నిర్ణీత సమయంలో పనుల వద్దకు చేరుకోవాలని, ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు పనులు చేయాలన్నారు. నిర్దేశి త కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.270 కూలి పొందవచ్చన్నారు. ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్ బొరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆదేశించారు. ప్రతి రోజు పని ప్రారంభానికి ముందు, పని తరువాత ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేయాలన్నారు. మస్టర్‌లో పేర్లు ఉన్నవారికి మాత్రమే పనులు కల్పించాలన్నారు.

మద్యం దుకాణం తనిఖీ



గడువు ముగిసిన మద్యాన్ని పారబోస్తున్న దృశ్యం

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో ప్రభుత్వ మద్య దుకాణంలో గురువారం అధికారులు తనిఖీ నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ రామకృష్ణారెడ్డి ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, అస్లాంబేగ్ సామాజిక తనిఖీలలో భాగంగా మద్యం దుకాణంలో రికార్డులు పరిశీలించారు. గడువు ముగిసిన బీర్ బాటిళ్లను పారబోశారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యం విక్రయించాలని,అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎక్సైజ్ ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ వెంకటకృష్ణయ్య తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ బీమా సర్వే పూర్తి చేయండి

కోవెలకుంట్ల: 2023–24 సంవత్సరానికి సంబంధించి ఈ నెల 10వ తేదీ నాటికి వైఎస్సార్ బీమా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక సూచించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ వలంటీర్లు వారికి కేటాయించిన 50 ఇళ్లను సందర్శించి వైఎస్సార్ బీమా రెన్యువల్, కొత్తగా నమోదు చేస్తున్నారన్నారు. కుటుంబ యజమానిని పాలసీదారునిగా, కుటుంబ సభ్యుల లో ఒకరిని నామినీగా నమోదు చేసి వివరాలు పొందుపరచాలన్నారు. సర్వే పూర్తి చేయడానికి మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉన్న దృష్ట్యా వలంటీర్లు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. వచ్చే ఏడాది కాలంలో 50 ఏళ్ల వయసు కలిగి ఉన్న బీమా పాలసీదారులకు సాధారణ మరణం సంభవిస్తే రూ.లక్ష, ప్రమాదవత్తు మరణిస్తే రూ.5 లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. 50 ఏళ్ల పైబడి 70 సంవత్సరాల్లోపు వయసు పాలసీదారులకు సాధారణ బీమా వర్తించదని, రూ.3 లక్షల వరకు ప్రమాద బీమా అందుతుందని వెల్లడించారు.

రైతులందరూ సహకరించాలి



బదిలీపై వెళ్తున్న మండల సర్వేయర్‌ను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

అవుకు(కొలిమిగుండ్ల): కొలిమిగుండ్ల మండల పరిధిలోని రైతులు, భూ యజమానులు సహకరించాలని మండల సర్వేయర్‌గా బాధ్యతలు చేపట్టిన సరిత కోరారు. సాధారణ బదిలీల్లో భాగంగా శిరివెళ్ల మండలంలో డిప్యూటీ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న సరిత పదోన్నతిపై గురువారం కొలిమిగుండ్ల మండల సర్వేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డిప్యూటీ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణకు మండల సర్వేయర్‌గా పదోన్నతి పొంది బదిలీపై అవుకు మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా బదిలీ అవుతున్న హరికృష్ణ, బాధ్యతలు చేపట్టిన సరితను తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్‌తో పాటు కార్యాలయ సిబ్బంది కలిసి సన్మానించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆళ్లగడ్డ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు కోలుకోలేక మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరు సమీపంలోని రామేశ్వరానికి చెందిన గురు ఆంజనేయులు (29) గత నెల 16వ తేదీన బైక్‌పై నంద్యాలకు వెళ్తూ బత్తలూరు సమీపంలో అదుపు తప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ఆంజనేయులును కర్నూలు వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తుండగా కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ ఘటనపై పోలీసుల విచారణ

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తులకు చెందిన నగదును చోరీ చేసిన ఘటనలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట్‌కు చెందిన కొందరు భక్తులు ఈ నెల 5వ తేదీన మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చారు. స్థానిక చిన్నకోనేరులో స్నానానికి వెళ్తూ వారి దుస్తులు, అందులో మనీపర్సు, ఇతర వస్తువులను చెట్టు కింద అరుగుపై ఉంచి వెళ్లారు. వారు స్నానానికి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి వారి దుస్తులు, పర్సులను చోరీ చేసి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లిన సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. చోరీ విషయం గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సుమారు రూ.30వేల నగదు ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై స్పందించిన మహానంది ఎస్‌ఐ జి.నాగేంద్రప్రసాద్ విచారణ ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నంద్యాలకు చెందిన ఓ దొంగను గుర్తించినట్లు తెలిసింది.

నిత్య ఆర్జిత సేవలు నిర్వహించాలి



ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: మండలంలోని మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో తిరుమల తరహాలో రోజూ స్వామి, అమ్మవార్లకు ఆర్జిత సేవలు నిర్వహించాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సూచించారు. ఆయన గురువారం ఆలయంలో జరిగిన విమాన శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, తమిళనాడు రాష్ట్రం, శివగంగ జిల్లా కలెక్టర్ పల్లె మధుసూధన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం అతిథులను ఆలయ ఈఓ పాండురంగా రెడ్డి, చైర్మన్ రామచంద్రుడు ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందజేసి, పట్టు వస్త్రంతో సత్కరించారు. వేదపండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై ఈఓ, చైర్మన్, రాష్ట్ర స్థపతితో మంత్రి చర్చించారు. ఆలయ పాలక మండలి సభ్యులు, స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈనెల 9న నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీశైలం నియోజకవర్గంతో పాటు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. 10వ తరగతి నుంచి ఉన్నత చదువులు చదివిన వారందరూ అర్హులేనన్నారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షుడు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, నాగన్న, పుల్లయ్య, విజయ్, రామకృష్ణారెడ్డి, పువ్వాడ భాస్కర్, సుల్తాన్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న శిరీష

ఆళ్లగడ్డ: నందింపల్లె గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, శిరీష (30) దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శిరీష కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధ పడుతోంది. వైద్యులకు చూపించినా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందింది. బుధవారం రాత్రి కుటుంబీకులు అందరూ గ్రామంలో జరిగే బంధువుల వివాహానికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా శిరీష విషద్రావణాన్ని తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబీకులు ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహులు గురువారం తెలిపారు.

ఆర్డీటీ సెట్‌లో సత్తాచాటిన విద్యార్థులు



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో ఆర్డీటీ సిబ్బంది

డోన్ టౌన్: ఆర్డీటీ సెట్–2023లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆరు సంవత్సరాలు విద్యతో పాటు వసతి సౌకర్యాలకు సంస్థ ఆర్థిక సహా యం అందిస్తుందని ఆర్డీటీ సంస్థ ఏరియా కో– ఆర్డినేటర్ నాగభూషణం అన్నారు. గురువారం విడుదలైన ఆర్డీటీ సెట్ ఫలితాల్లో డోన్ ఏరియా నుంచి ఆరుగురు విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు సంస్థ నిర్వహించిన ఆర్డీటీ సెట్ పరీక్షలకు డోన్, ప్యాపిలి మండలాల నుంచి దాదాపు 60 మంది హాజరు కాగా ఆరుగురు అర్హత సాధించారు. ప్యాపి లి మండలం కలచట్లకు చెందిన రాణి, ఏనుగుమర్రికి చెందిన తేజశ్విని, డోన్ మండలం దొరపల్లెకు చెందిన ప్రభాస్, సీసంగుంతలకు చెందిన యుగంధర్, తరుణ్, రామదుర్గం రాజశేఖర్ అర్హత సాధించారన్నారు. వారిని స్థానిక కార్యాలయంలో గురువారం అభినందించారు. ఆర్డీటీ సిబ్బంది నాగేంద్ర, అయ్యస్వామి, రామ్‌మోహన్, మారెన్న, బాలగోపాల్, కరీం, ఇంద్ర, లత తదితరులు ఉన్నారు.

రుణ యాప్ వేధింపులతో ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

డోన్ టౌన్: ఆన్‌లైన్ యాప్ రుణం తీసుకున్న వ్యక్తి ఆ సిబ్బంది వేధింపులు తాళలేక ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణం నుంచి కంబాలపాడుకు వెళ్లే దారిలో ఇనుప కడ్డీల అంగడి యజమాని రఫ్తాజ్ ఆన్‌లైన్ యాప్ ద్వారా అప్పు తీసుకున్నాడు. గత రెండు రోజులుగా అతని సెల్‌ఫోన్‌కు అసభ్యకర మెసేజ్‌లతో పాటు అతను వేరే మహిళతో నగ్నంగా ఉన్నట్లు ఫొటోలు మార్ఫింగ్ చేసి బంధువులు, స్నేహితులకు, తెలిసిన వారికి వైరల్ అవుతుండటంతో అవమానంగా భావించిన అతడు గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ల సలహా మేరకు కర్నూలు వైద్యశాలకు తరలించారు. ఈ విషయంపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా రుణయాప్ వివరాలు, అప్పు ఎంత, ఎప్పుడు తీసుకున్నారు. ఎంత చెల్లించారు తదితర విషయాలపై ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అభివృద్ధి పథం.. మార్గం సుగమం



భూపనపాడు రోడ్డులో వాగు దాటేందుకు ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు (నాడు)



రూ.28 లక్షలతో వాగుపై నిర్మించిన వంతెన (నేడు)



ఎస్సీ కాలనీలో రోడ్డు దుస్థితి (నాడు)



ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు (నేడు)

బనగానపల్లెరూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామ పంచాయతీలోని జిల్లెల్ల గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో సుమారు రూ.82 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులతో పాటు భూపనపాడు రోడ్డులో ఉన్న వాగుపై వంతెన నిర్మాణపనులు దాదాపుగా పూర్తి కావడంతో గ్రామ ప్రజలు,రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో గతంలో భూపనపాడు రోడ్డులో ఉన్న వాగులో నీరు ప్రవాహిస్తుండడంతో రైతులు ఎడ్ల బండ్లతో పొలాలకు వెళ్లాలన్నా, పంట ధాన్యాన్ని ట్రాక్టర్లలో ఇంటికి తరలించాలన్నా నానా అవస్థలు పడేవారు. గత టీడీపీ హయాంలో సమస్యను పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం పట్టించుకోలేదు. ఇటీవల ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వాగు సమస్య, సీసీ రోడ్ల సమస్యను గ్రామ ప్రజలతో పాటు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు ఎం.శివరామిరెడ్డి, నాయకులు శంకర్ రెడ్డి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సీసీ రోడ్ల నిర్మాణానికి డీఎంఎఫ్ కింద రూ.48 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు మరో రూ.6 లక్షలు మంజూరు చేయించారు. అలాగే వాగుపై వంతెన ఏర్పాటు కోసం ప్రత్యేకంగా డీఎంఎఫ్ కింద మరో రూ.28 లక్షలు మంజూరు చేసేలా కృషి చేశారు. ఇప్పటికే వంతెన నిర్మాణంతో పాటు గ్రామంలోని పలు వీధుల్లో సీసీ రోడ్లు పూర్తయ్యాయి. త్వరలోనే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పీఆర్ ఏఈ వెంకటరమణ, తిమ్మాపురం సర్పంచ్ అల్లె సుప్రజ తెలిపారు. గ్రామంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్లు వేయడం, ఎన్నో సంవత్సరాల నుంచి సమస్యగా ఉన్న వాగుపై వంతెనను నిర్మించడంతో రైతులు, ప్రజలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

240 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీ

చాగలమర్రి: అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ నాగరాజు యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. వెలుగోడు నుంచి మైదుకూరుకు భారీగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడటంతో జాతీయ రహదారి పై మద్దూరు మెట్ట సమీపంలో దాడి చేసి బియ్యం లారీని పట్టుకున్నారు. 240 బస్తాల బియ్యం, లారీ స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. దాడిలో సీఐతో పాటు విజిలెన్స్ హనుమంతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.